తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
22 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :

# కబడ్డీలో సత్తా చాటిన ఎస్‌జీఎఫ్ అండర్ -19 క్రీడాకారులు

**○ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర కబడ్డీ టోర్నమెంట్ - కమ్ - సెలక్షన్స్ విజయవంతం**

**○ప్రత్యేక అతిథిగా హాజరైన శాన్వి జూనియర్ కళాశాల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్**



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎస్‌జీఎఫ్ అండర్ – 19 జూనియర్ కళాశాలల బాలుర కబడ్డీ టోర్నమెంట్ - కమ్ - సెలక్షన్స్ ఉత్సాహభరిత వాతా వరణంలో విజయవంతంగా నిర్వహించ బడ్డాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ అండర్ -19 జూనియర్ కళాశాలల సెక్రటరీ ఎల్. బన్సీలాల్ మాట్లాడు తూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సెలక్షన్స్‌లో క్రీడాకారుల ప్రతిభ, ఆటతీరు, ప్రదర్శన ఆధారంగా రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -19 జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**క్రీడాకారులకు ఎర్రం శెట్టి మునీందర్ ప్రోత్సాహం**

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన శాన్వి జూనియర్ కళాశాల చైర్మన్ ఎర్రం శెట్టి మునీందర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తే వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని, కబడ్డీ క్రీడ కేవలం శారీరక దారుఢ్యానికే కాకుండా ధైర్యం, సమయస్ఫూర్తి, ఏకాగ్రత, పట్టుదల, జట్టు సమన్వయాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. క్రీడాకారులు గెలుపుతో ఉత్సాహపడకుండా, ఓటమితో నిరుత్సాహపడకుండా ప్రతి పోటీ నుంచి అనుభవాన్ని పొందుతూ ముందుకు సాగాలని ఎర్రం శెట్టి మునీందర్ సూచించారు. క్రమశిక్షణతో నిరంతర సాధన చేస్తే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించారు. అనంతరం టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విజేత జట్లకు ఎర్రం శెట్టి మునీందర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

**టోర్నమెంట్ విజేతలు**

ప్రథమ బహుమతి టిజిఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ అండ్ జెసి మంథని – పెద్దపల్లి జిల్లా, ద్వితీయ బహుమతి టీజిఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ అండ్ జె సి గొల్లపల్లి – జగిత్యాల జిల్లా, ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ బాసబోయిన వేణుగోపాల్, కట్ట సంతోష్, కరీంనగర్ జిల్లా కబడ్డీ సెక్రటరీ మల్లేశం గౌడ్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల ప్రాధాన్యతను వివరించి, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, అశోక్, రమేష్, జగదీశ్వర్, చందు, రాజశేఖర్, విష్ణువర్ధన్, దానియల్, శ్రీనివాస్, బానోత్ రాజు, కిషోర్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 68 దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**
జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, ఉపాధి, సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 68 దరఖాస్తులు ప్రజావాణిలో అందాయి. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సకాలంలో పరిష్కారం అందేలా చూడాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటి పరిష్కారానికి ప్రాధా న్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి, సీఈఓ చందర్, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్ఓ పాండు, వివిధశాఖలకుచెంది జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనంసాక్షి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 111 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై నిరంతరం తమ గొంతుకగా నిలుస్తున్న "జనంసాక్షి"

**○తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్యం అస్తవ్యస్తం కథనాలకు స్పందించిన అధికారులు**

**○వారం రోజుల్లోగా సమస్యను పరిష్కారిస్తామన్న మిషన్ భగీరథ అధికారులు**

**○గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం**



**సదాశివనగర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై నిరంతరం తమ గొంతుకగా నిలుస్తున్న జనంసాక్షి మరో ముందడుగు వేసింది. సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిన పరిస్థితిపై జనంసాక్షి పేప ర్ లో ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించారు. ఆదివారం జనంసాక్షిలో గ్రామ సమస్యలను వెలుగులోకి తెస్తూ కథనాలు ప్రచురితం కాగా, సోమవారం ఉదయమే మిషన్ భగీరథ అధికారులు గ్రామానికి చేరుకుని హుటాహుటిన చర్యలు చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురికి, చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు రోడ్ల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే పనులను పారిశుద్ధ్య సిబ్బంది ముమ్మరం చేశారు. దీంతో గ్రామంలో కొంతకాలంగా పేరుకుపోయిన అపరిశుభ్రత సమస్యపై అధికారులు దృష్టి సారించినట్లైంది. అదేవిధంగా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై మిషన్ భగీరథ అధికారులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరాను వారం రోజుల్లో పునరుద్ధరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది.



ఉత్తునూర్‌లో తాగునీటి ఎద్దడి



పారిశుధ్యం..అస్తవ్యస్తం.!



**ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన 'జనంసాక్షి'**

ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపేలా చేసిన జనంసాక్షి కథనాలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను అధికారులు వెంటనే గుర్తించి చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు జనంసాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



# గంభీరావుపేట్‌లో 60 గ్రాముల గంజాయి.. స్వాధీనం ? ఇద్దరు అరెస్ట్

**గంభీరావుపేట్, సెప్టెంబర్ 21 జనం సాక్షి;**
గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా కలిగి ఉండి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సముద్రలింగాపూర్ గ్రామ శివారులోని నాగంపేట కామన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. నిందితులను పెంట మనిశాంత్ (19), బత్తిని సాయి కుమార్ (28)గా పోలీసులు గుర్తించారు. వారి వద్ద ఉన్న కవర్‌ను పరిశీలించగా గంజాయి లభించింది. పంచుల సమక్షంలో ఎలక్ట్రానిక్ డిజిటల్ వెయింగ్ మెషిన్‌తో తూకం వేయగా సుమారు 60 గ్రాముల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఔఆఖూ చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై శ్రీకాంత్ ప్రజలను కోరారు.

# ప్రజావాణి'లో సైదాపూర్ అన్నదాతల వినూత్న వినతి

## ◆కార్యాలయం ఆచూకీ తెలియక రైతుల అవస్థలు ◆ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు

**సైదాపూర్ సెప్టెంబర్ 21 (జన్మ సాక్షి)**
మా సమస్యలు చెప్పుకుందామంటే మండలంలో ఇరిగేషన్ ఆఫీసే కనిపించడం లేదు.. దయచేసి మా కార్యాలయం ఎక్కడుందో వెతికిపెట్టండి సారూ!" అంటూ సైదాపూర్ అన్నదాతలు అధికారులను వేడుకున్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో పలువురు రైతులు హాజరై అధికారులకు ఈ మేరకు వినూత్నంగా వినతిపత్రం అందజేశారు. సైదాపూర్ మండల కేంద్రంలో కరీంనగర్ డివిజన్-2 పరిధిలోకి వచ్చే ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి బోర్డు గానీ, స్పష్టమైన చిరునామా గానీ లేకపోవడంతో సాగునీటి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. కాలువల మరమ్మతులు, నీటి విడుదలపై దరఖాస్తులు ఇద్దామంటే అధికారుల జాడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
దీనిపై సంబంధిత డీఈఈని సంప్రదిస్తే హుజూరాబాద్ బస్టాండ్ వద్ద అని ఒకసారి, కేసీ క్యాంపు వద్ద అని మరోసారి పొంతనలేని



సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు. రైతులు అక్కడికి వెళ్లి చూస్తే ఆ కార్యాలయం ఇక్కడ లేదని స్థానికులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా కరీంనగర్ వెళ్లాల్సి వస్తోందని, అక్కడి నుంచి అనుమతులు వచ్చేసరికి కాలయాపన జరిగి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు.?జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయి విచారణ జరపాలని, మండల కేంద్రంలోనే పూర్తిస్థాయి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైతులు గడ్డం విశాల్, మొలుగు రమేశ్, కుమార్, యాదగిరి తదితరులు ఉన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ..

## వివిధ శాఖల అధికారులతో సీపీ సమన్వయ సమావేశం

**గోదావరిఖని, జనంసాక్షి :**
వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పోలీస్,సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ,విద్యుత్, వైద్య ఆరోగ్య, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక,ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు,భద్రతా చర్యలు,ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సీపీ అధికారులతో చర్చించారు.
ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగే నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.గత సంవత్సరం నిమజ్జనం సందర్భంగా ఎదురైన సమస్యలు, ఇబ్బందులు, లోపాలను సమీక్షించి, అవే సమస్యలు ఈ సంవత్సరం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రక్షణ సిబ్బంది,శిక్షణ పొందిన ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.మున్సిపల్ అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు,లైటింగ్, రోడ్ల పరిస్థితి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన మార్గాలు, మండపాలు, నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను ముందుగానే పరిశీలించి,ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఫైర్ టెండర్లు, సిబ్బంది, రక్షణ పరికరాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.సింగరేణి అధికారులు తమ పరిధిలోని నిమజ్జన మార్గాలు, రహదారులు, సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన సహకారం అందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీస్ అధికారులు నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ,రద్దీ నిర్వహణ, బందోబస్తు, పార్కింగ్,క్రేన్‌లు, ఇతర అత్యవసర సేవల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్,ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్,ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అక్రమ మొరం రవాణాపై బోధన్ ఆర్డీవో ఉక్కుపాదం

**బోధన్, సెప్టెంబర్ 21 ( జనంసాక్షి ) :**
బోధన్ డివిజన్ పరిధిలోని సంగం గ్రామం (బోధన్ మండలం), హున్సాపూర్ గ్రామం (వర్ని మండలం), ఘన్‌పూర్ (చందూర్ మండలం) మూడు మండలాల సరిహద్దులు కలిసే ప్రాంతంలో జరుగుతున్న మొరం అక్రమ తవ్వకాలను హఠాత్తుగా పరిశీలించారు. వెంటనే అక్రమ తవ్వకాలను నిలిపివేయించి, చందూర్, వర్ని, బోధన్ తహసీల్దార్లను సంఘటనా స్థలానికి పిలిపించి, వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ అక్రమ తవ్వకాలు సర్వే నంబర్ 139/1లో జరిగాయి. ఈ సర్వే నంబర్ పై పేర్కొన్న మూడు మండలాల సరిహద్దులు కలిసే ప్రాంతంలో ఉండటంతో పాటు, మూడు మండలాల మధ్య ఈ సర్వే నంబర్ లో గల భూమి మీద సరిహద్దు వివాదం కూడా కలదు. అందువల్ల మూడు మండలాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించాలని బోధన్ డీఐఓఎస్‌ను ఆర్డీఓ మేడమ్ ఆదేశించారు. కాగా, భూ-భారతి రే సర్వే గ్రామ సభ లో భాగంగా, కోటగిరి మండలంలో ఉన్న డిఐఓఎస్. దత్తు ఆర్డిఓ ఆదేశాలతో సదరు సమస్య ను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

# శిలాఫలకంపై సర్పంచ్ భర్త పేరు తొలగించాలి

## ప్రజావాణిలో ఫిర్యాదు

**శంకరపట్నం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**



మండలంలోని కాచాపూర్ గ్రామంలో నూతన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై సర్పంచ్ భర్త పేరు చేర్చడంపై ఉపసర్పంచ్ లింగంపల్లి క్రిష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఫిర్యాదు చేశారు.గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవి పేరుతో పాటు ఆమె భర్త ఊకంటి మధుకర్ పేరును శిలాఫలకంపై చేర్చారని, ఇది నిబంధనలు, ప్రొటోకాల్‌కు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై పేర్ల నమోదుకు ఉన్న నిబంధనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు శిలాఫలకంపై ఉన్న సర్పంచ్ భర్త ఊకంటి మధుకర్ పేరును తొలగించాలని ఉపసర్పంచ్ క్రిష్ణారెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ అంశంపై అధికారులు విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

## బోధన్ మాహాజన సభలో తీర్మానం

**బోధన్, సెప్టెంబర్ 21 ( జనంసాక్షి ) :**
ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సోమవారం జరిగిన బోధన్ సహకార సంఘం మహాజన సభలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బోధన్ సహకార సంఘం అధ్యక్షులు ఉద్మీర్ లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు మరియు సంఘ సభ్యులు పాల్గొని పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘము యొక్క 2025-26 సం.పు జమ-ఖర్చులు, లాభ- నష్టములు మరియు 2026-27 సం.పు అంచనా బడ్జెట్ సంఘ కార్యదర్శి గారు చదివి వినిపించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తొందరగా ప్రారంభించాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు సమయములో చిన్న సన్నకారు రైతుల కోసం ట్రాక్టర్ లకు అనుమతి ఇవ్వాలన్నారు. ఎరువులు తీసుకొనుటకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆప్ ను వెంటనే తొలగించి పాత పద్ధతిలోనే ఎరువుల సరఫరా కొనసాగించేటట్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు ఉద్మీర్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు మానబయి వీరభద్ర రావు, డైరెక్టర్లు తోకల సాయన్న, హీరా నాయక్, సింగం లక్ష్మణ్, బేగారి పోశెట్టి మరియు సంఘ సభ్యులు కోట పోతారెడ్డి, నక్క లింగన్న, పులి భాస్కర్, విద్యా సాగర్, గుమ్మల సాయిరెడ్డి, చిన్ను గొండా, ఎనుకుంచ నాగనాథ్, బండారు పల్లి సర్పంచ్ కాడి సాయిలు మరియు సంఘ కార్యదర్శి ఉమాకాంత్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం

## - సింగల్ విండో చైర్మన్ చేపూరి గంగాధర్

## - బాధ్యతలు చేపట్టిన పాలకవర్గ సభ్యులు

**కోనరావుపేట(జనంసాక్షి):**



రైతు సంక్షేమమే ధ్యేయమని సింగల్ విండో చైర్మన్ చేపూరి గంగాధర్ అన్నారు సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొత్త పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. 12 మంది డైరెక్టర్లతో నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయగా చైర్మన్ గా చేపూరి గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు మరో 12 మంది డైరెక్టర్లు కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన.నాణ్యమైన సేవలందిస్తామన్నారు. వేములవాడ ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కొనరావుపేట సహకార సంఘాన్ని బలోపేతం చేసి రైతులకు అన్ని రకాలుగా సేవలు అందిస్తామన్నారు.ఇందుకు పాలక వర్గ సభ్యులు. ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. నూతన చైర్మన్ గంగాధర్ ను డైరెక్టర్లను శాలువలతో సన్మానించారు. సీఈఓ కేశవులు చైర్మన్. డైరెక్టర్లకు బాధ్యతను అప్పగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మార్కెట్ డైరెక్టర్లుజిల్లా మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులను జరుపుకోవాలి

**కోనరావుపేట (జనంసాక్షి):**



భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రులు జరుపుకోవాలని చేపూరి గంగాధర్ ఎస్సై రామ్మోహన్ అన్నారు సోమవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకొని వినాయకుని నిమజ్జనం చేయాలని కులమతాలకు అతీతంగా హిందువులు సాంప్రదాయంగా చేసుకునే పండగ వినాయక చవితి అని ఈ పండుగను భక్తిశ్రద్ధలతోనే జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బా శెట్టి నాగరాజు. ఎంపీడీవో స్నిగ్ధా రెడ్డి ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుడికి న్యాయం చేయాలి :ప్రజావాణిలో ఫిర్యాదు

**బోధన్, సెప్టెంబర్ 21 ( జనంసాక్షి ) :**
బోధన్ ప్రజావాణిలో భాగంగా భిక్నెల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తూ, ప్రమాదవశాత్తు మృతి చెందిన బాగారే యాదు, బాగారే బాలాజీ ల కుటుంబ సభ్యులకు ఇచ్చిన హామీలను అమలు కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసిన టీ యూ సీ ఐ నాయకులు. సోమవారం నాడు బోధన్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం లో జరిగిన ప్రజావాణిలో 2025 సెప్టెంబర్ 11న భిక్నెల్లి గ్రామానికి చెందిన జేపీ కార్మికులు బాగారే యాదు, బాగారే బాలాజీ లు ట్రాక్టర్ పై రాంపూర్ గ్రామం లోని ట్రాన్స్ఫారం నుండి కరెంటు స్తంబాలను తీసుకువస్తుంటే మార్గమధ్యంలో ట్రాక్టర్ బోల్తా పడి స్తంభాల కింద పడి మృతి చెందడం జరిగింది వారి కుటుంబ సభ్యులకు ఆరోజు సబ్ కలెక్టర్ గారు ప్రభుత్వం తరపున ఇచ్చిన హామీలను అమలు చేయాలని టి యు సి ఐ నాయకత్వంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ బోధన్ మండలం భిక్నెల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తున్నటువంటి బాగారే యాదు, బాగారే బాలాజీ లను గత సంవత్సరం సెప్టెంబర్ నెల 11వ తేదీ నాడు రాంపూర్ గ్రామంలో గల ట్రాన్స్ఫారం నుండి కరెంటు పోల్స్ (స్తంభాలను) లను తీసుకురావడానికి ట్రాక్టర్ తో పంపగా వాటిని



తీసుకుని వచ్చేటప్పుడు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందారు. దానికోసం వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ పోస్టుమార్టం కోసం బోధన్ లోని జిల్లా ఆసుపత్రికి తీసుకురాగా ఆ రోజు మృతుల కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులతో కలిసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశామని అయితే ఆ రోజు సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి సంబంధిత అధికారులు, బోధన్ ఎస్సై, సీఐలు, ఎంపీడీవో, ఎండిఓ, ఎమ్మార్వోలు వచ్చి మాతో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సబ్ కలెక్టర్ దగ్గరికి తీసుకువెళ్లి చర్చలు జరపగా సబ్ కలెక్టర్ గారు వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని యాదు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రెండు ప్రభుత్వ ప్లాట్లు, రెండు లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని, బాలాజీ కుటుంబం కు ఒక లక్ష రూపాయాల ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ స్థలంలో ఇంద్రమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారని నేటికీ సంవత్సరం గడిచిపోయిన ఇచ్చిన హామీలను నెరవేర్చలేరని ఇప్పటికైనా వారికి నాడు చెప్పిన మాట ప్రకారం హామీలను వెంటనే నెరవేర్చాలని బి.మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి యు సి ఐ నాయకులు బి నాగేశ్వర్ మరియు సోన్ కాంబ్లే విట్టల్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఒకే చాంపియన్‌షిప్‌లో మూడు మెడల్స్..

## నల్లవెల్లి ఆనంది అరుదైన ఘనత

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):**
పుదుచ్చేరిలో నిర్వహించిన 37వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ?2026లో కమాన్‌పూర్ గ్రామానికి చెందిన యువ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది సత్తాచాటింది. చాంపియన్‌షిప్‌లో మూడు విభాగాల్లో పాల్గొన్న ఆమె 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు మరో రెండు విభాగాల్లో బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకుని మొత్తం మూడు పతకాలతో మెరిసింది. ఒకే చాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు సాధించడం కమాన్‌పూర్ గ్రామానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే క్రీడా రంగంలో ప్రతిభను చాటుతూ వరుస విజయాలు సాధిస్తున్న




ఆనందిని గ్రామస్థులు అభినందించారు. ఆమెకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు నల్లవెల్లి భారతి?శంకర్ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి క్రీడా వేదికలపై ప్రతిభను చాటుతున్న ఆనంది విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు పేర్కొన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత ఆమెను ఆదర్శంగా తీసుకుని క్రీడారంగంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆనంది భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని, అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించే స్థాయికి ఎదగాలని గ్రామస్థులు కోరుకున్నారు. ఆమె విజయ పరంపర మరెందరో యువ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని, క్రీడల పట్ల ఆసక్తిని నింపాలని ఆకాంక్షించారు.



# భూమిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
ఇల్లంతకుంట మండలం ఆరేపల్లి గ్రామ ఉపసర్పంచ్ గుడికందుల భూమిరెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పరామర్శించారు. భూమిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, భూమిరెడ్డి మృతి గ్రామానికి, ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దామెర సత్యం, అన్నాడి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, బద్దం హనుమంత రెడ్డి, ఎల్లోజీ, కముటం రాజిరెడ్డి, సర్పంచ్ మోహన్ రావు తదితరులు పాల్గొని భూమిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.

# సిరికొండ గ్రామంలో గణేష్ మండపాల కమిటీ సభ్యులతో డిఎస్పి సమీక్ష సమావేశం

**కథలాపూర్ సెప్టెంబర్ 21(జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని జగిత్యాల జిల్లా డీఎస్పీ రాములు కతలాపూర్ ఎస్సై కిరణ్ కుమార్ సోమవారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల



నిర్వహణ, నిమజ్జనం ఏర్పాట్లపై మండప నిర్వాహకులు, మరియు గ్రామ సర్పంచ్ ముధం రవి తో మాట్లాడారు. గణేష్ నిమజ్జనం సమయంలో డీజే లు ఉపయోగించరాదు అని తెలియజేశారు మరియు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యువకులు పోలీసుల సూచనలు పాటించాలని, శాంతియుతంగా మరియు సురక్షితంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా మండపం వద్ద ఉన్న యువకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. సురక్షితమైన గణేష్ నిమజ్జనం కోసం అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# నిమజ్జన వేడుకలను విజయవంతం చేయండి

**చొప్పదండి, సెప్టెంబర్ 21( జనం సాక్షి):**
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23వ తేదీన పట్టణంలో నిర్వహించే సామూహిక వినాయక నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని మున్సిపల్



చైర్పర్సన్ వడ్లూరి సరిత పిలుపునిచ్చారు పురపాలక సంఘం చొప్పదండి కార్యాలయములో వినాయక నిమజ్జనం ఉత్సవాలపై వడ్లూరి సరిత – శ్రీనివాస్ అధ్యక్షతన కీర్తి నాగరాజు ఆధ్వర్యములో వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస–గంగయ్యగౌడ్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు వినాయక మండపంల ఇంచార్జిలతో సమీక్షా సమావేశము నిర్వహించబడినది. సమీక్షా సమావేశము కు హాజరైన చైర్పర్సన్ వడ్లూరి సరిత – శ్రీనివాస్ , కమిషనర్ కీర్తి నాగరాజు శ్రీయుత సబ్–ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్ రెడ్డి లు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేయాలని కోరినారు. ఇందుకుగాను పోలీస్ విభాగము, విద్యుత్ శాఖ, పురపాలక శాఖ, ఫైర్ విభాగము, వైద్యశాఖ, మత్స్యశాఖ మరియు ఇరిగేషన్ విభాగాధికారులు అందరూ వారి వారి యొక్క విభాగముల నుండి తగు ఏర్పాట్లు చేయగలరని కోరారు సమావేశంలో కౌన్సిలర్లు కనమల్ల రాజశేఖర్ ,రాజన్నల రాజు , గుర్రం రాజేందర్రెడ్డి గారు, గుర్రం సుజిత్రెడ్డి , పిట్టల వెంకటేష్ మున్సిపల్ ఎఇ., ఇరిగేషన్ ఎ.ఇ., విద్యుత్ ఎ.ఇ. వైద్యశాఖ, ఫైర్ విభాగం, గణేష్ మండపముల ఇంచార్జీలు, నాయకులు చిల్ల శ్రవణ్ కుమార్ , వడ్లూరి శ్యాంకుమార్ , కొత్త గంగారెడ్డి , జిట్ట కుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత..

## గాగిరెడ్డిపల్లి గ్రామంలో జిపి కార్మికులకు ఘన సన్మానం..

**చిగురుమామిడి సెప్టెంబర్ 21(జనంసాక్షి):**
మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ సన్నిల్ల కవిత అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సన్నీల్ల కవిత వెంకటేష్ మాట్లాడుతూ మాట్లాడుతు పరిశుభ్రమైన గ్రామమే మన లక్ష్యం అనే సందేశంతో గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నవారే పారిశుధ్య కార్మికుల పాత్ర చాల గొప్పదాని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత,వెంకటేష్ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి,పాలకవర్గ సభ్యులు మంద శ్రీనివాస్,బొమ్మగాని వెంకటేశం గౌడ్,అన్నవేణి శ్రీనివాస్,మానస, మంజులా,రమ,పంచాయతీ కార్యదర్శి సంపత్ గ్రామస్తులు సంపత్ రెడ్డి,రాజయ్య, కొమురయ్య,గట్టు సంపత్ పారిశుధ్య కార్మికులు రాజేశం,సంబయ్య,సమ్మయ్య,రామవ్వ,మూతవ్వ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా ‘పోషణ మాసం’ కార్యక్రమం

**రుద్రంగి సెప్టెంబర్ 21 ( జనం సాక్షి)**
రుద్రంగి మండల కేంద్రంలోని ఒకటవ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ అంబటి సరితా ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒకటవ వార్డు సభ్యులు గసికంటి ప్రేమల రాజు,గ్రామ కార్యదర్శి స్వామి, ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వార్డు సభ్యురాలిని సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు గసికంటి ప్రేమల మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం గ్రామ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ. గ్రామంలోని గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ఉండటానికి ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని రోజువారీగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ



పరిశుభ్రతను పాటించాలని, అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అంగన్వాడీ టీచర్ అంబటి సరిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తున్న ఈ పోషణ మాసం ఉద్దేశాలను వివరించారు. చిన్నపిల్లల్లో కుంగుబాటు, బరువు తక్కువగా ఉండటం వంటి సమస్యలను నివారించడానికి తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పిల్లల ఎదుగుదలకు అవసరమైన ఆహార నియమాలను ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలను గ్రామ కార్యదర్శి కి,వార్డు సభ్యుల కు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, గర్భిణులు, బాలింతలు,పాల్గొన్నారు.

# జనగామలో రైతు ఆత్మ సదస్సు..



**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం కార్పొరేషన్ పరిధి 6వ డివిజన్ జనగామ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ( ఆత్మ ) బిటిటి ( బ్లాక్ టెక్నాలజీ టీం ) పెద్దపల్లి శాఖ ఫామ్ స్కూల్ ఆన్ పాడి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పెద్దపల్లి ఏడిఏ మడికొండ శ్రీనాథ్,హెడ్ కెవికె శాస్త్రవేత్త వెంకట రమేష్,శాస్త్రవేత్త వై.వెంకన్న, ఏవో ప్రకాష్,యోజన ఏఈఓ,స్థానిక కార్పొరేటర్ తోకల శ్యామని- రమేష్ పాల్గొన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు వరిలో పిలకల దశలో పిలకలు ఎక్కువ రావటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చీడ పిడలు, తెగలకు తీసుకోవాల్సిన జాగ్రత్త రసాయన ఎరువులు నానో ఎరువులు, నానో డిఏపి ఎలా వాడాలి, వ్యవసాయంలో అగ్గి తెగులు నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, తెగులు గాలి ద్వారా, విత్తనాల ద్వారా ఎక్కువ సోకుతాయి వాటిని విత్తనాల శుద్ధి ద్వారా సోకకుండా నివారించవచ్చు. చలి కాలంలో చలి ముదురుతే అగ్గి తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.పొలం గట్ల మీద గడ్డి పెరగకుండా చూసుకోవాలనీ, ఎందుకంటే ముందుగా తెగులు గట్లకు సోకి ఆ తర్వాత పొలం సోకుతుందన్నారు. గట్లకు గడ్డి మందు కొట్టు కోవాలన్నారు, రైతు పొలం తిరిగే టప్పుడు ఒకే గట్టు వెంబడి వెళ్లకుండా అన్ని గట్లు తిరిగి నప్పుడే పంటకు ఎక్కువ తెగులు సోకింది తెలుసుకోగలుగుతా మన్నారు. అలాగే రైతులు పొలం భూసారా పరీక్షలు చేయించు కొని పంట దిగుబడి రావాలంటే భూ సారా పరీక్షలు చేయించుకున్న తరువాత భూమి ఎలాంటి ఎరువులు వాడాలనీ తెలుసుకొని, ఎరువులు వాడితే పంట దిగుబడి ఎక్కువగా ఉంటుంది అని వాతావరణ పంటలు వెయ్యాలి, పంట మార్పులు చేస్తే భూ సారం పెరిగి పంట దిగుబడి వస్తుంది అని చెప్పారు.ఎక్కువ రైతుల అభిప్రాయాలు భూసారా పరీక్షలు నిర్వహించాలి, రైతు లకు నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం ద్వారా అందించాలని అలాగే పంట పండించిన తరువాత రైస్ మిల్లర్ ల్ల వాళ్ళ మాకు ఎక్కువగా నష్టం జరుగుతుందని వాటి పైన కూడా ప్రభుత్వం అధికారులు దృష్టి పెట్టాలని రైతులు అధికారులకు తమ సమస్య లు వివరించటం జరిగిందనీ, దీనికి అధికారులు మీ సమస్యలు పై అధికారుల దృష్టి కి తీసుకెళు తామని చెప్పారు.ఈ కార్యక్రమం లో రైతులు హన్మంత్ రావు, రుద్ర బట్ల నిఖిల్,జువ్వాడి విజయ్ రావు, ఐత లక్ష్మయ్య, బొడ్డు రవీందర్, జనగామ గట్టయ్య, నీలం సంజీవ్,బండారి రవీందర్, ఎర్ర మల్లయ్య, ఆర్మూటీ రాజయ్య, పైడి రాజు, చెల్పూరి శేఖర్, గాదె చంటి,గ్రామ రైతు లు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి SRSP నీటిని విడుదల చేయండి

చొప్పదండి, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):
గణేష్ నవరాత్రులు పూర్తి కావస్తున్న సమయంలో భక్తుల సౌకర్యార్థం విగ్రహాల నిమజ్జనం కోసం ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుండి కాలువలకు నీటిని విడుదల చేయాలని ఎస్సారెస్పీ ప్రాజెక్టు అఇ కి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశించారు. గత కొన్ని సంవత్సరాలుగా గణేశ్ విగ్రహాలను కాకతీయ కాలువలతో పాటు పలు డిస్ట్రిబ్యూటరీ కాలువలలో నిమజ్జనం చేస్తారని ,కాలువ లో నీటి సరఫరా లేక భక్తుల ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నీటిని విడుదల చేయాలని సి ఈ నీ ఆదేశించారు.కాగా ఓఅం ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తామని సి ఈ తెలిపారు. గణేష్ నిమజ్జనం కు నీటిని విడుదల చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే కు సింగిల్ విండో చైర్మన్ కౌన్సిలర్ గుర్రం రాజేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరుమండ్ల గంగయ్య, వడ్లూరి శ్రీనివాస్ ,తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



# మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**చొప్పదండి, సెప్టెంబర్ 21( జనంసాక్షి):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా ఉపాధ్యాయురాలుగా ఎంపికైన మండలంలోని కాట్నపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయురాలు రజిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సునీత లను చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగానికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమైనదని కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందిస్తూ,వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. సమాజంలో గురువు స్థానం ఎల్లప్పుడూ అత్యున్నత మైనదని కొనియాడారు ముఖ్యంగా మన కాట్నపల్లి పాఠశాలలో సేవలు అందిస్తున్న మీరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవడం చాలా గర్వంగా ఉంది అని మన గ్రామ ప్రజల తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్స్ గుర్రం రాజేందర్ రెడ్డి,పిట్టల వెంకటేష్,మాజీ ఎంపీటీసీలు గాజంగి రాములు, కట్టేకోల లక్ష్మణ్ సింగిల్ విండో కార్యదర్శి కళ్లెం తిరుపతి రెడ్డి ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టి మరల్చుతున్నారు..

## - బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి..




**గోదావరిఖని, జనంసాక్షి :**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడు తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్తే మార్షల్స్‌తో అడ్డుకున్నారని, ఈ ఘటనను ప్రజలంతా చూశారని అన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ టీషర్టులు ధరించి వెళ్లడం సరైనదైతే, తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీషర్టులు ధరించడం ఎందుకు తప్పని ప్రశ్నించారు.గతంలో మాజీ సీఎం కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు, 800 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా 66 ఎకరాలు అంటూ పేర్కొనడం వారి ఆరోపణల్లోని వైరుధ్యాన్ని చూపిస్తోందని విమర్శించారు. దళితుల పేరుతో ఉన్న అసైన్డ్ భూములు కేసీఆర్ అధీనంలో ఉన్నాయని, వాటిని దళితులకు పంచుతామని చెప్పడం కూడా ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్మికులు, ప్రజలు సింగరేణి భూముల్లో ఇళ్లు నిర్మించుకునేలా జీవో 76 తీసుకొచ్చారని హరీష్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం జీవో 22ఏ తీసుకువచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 22ఏ ద్వారా భూములు కలిగిన వారి నుంచి 30 శాతం వాటాను తీసుకునే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దందా, భూదందాలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించిన హరీష్‌రెడ్డి, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మరల్చేందుకే ఇలాంటి రాజకీయాలు చేస్తోందని మరోసారి విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ఐత శివ కుమార్, బక్కి కిషన్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జహీద్ పాషా, పోలాడి శ్రీనివాస్, బూరుగు వంశీకృష్ణ, చొప్పరి శ్రీనివాస్, పశుపుల బాపు, మేకల రామస్వామి, బోట్ల పోషం,రొడ్డ సంపత్, గొర్రె నర్సింగ్, గొర్రె శంకర్,కడర్ల శ్రీధర్, కడమండ్ల శ్రీహరి, కంకర దేవేందర్, కొండా సురేష్, పోయిల రవి, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, సార్ల ఉదయ్, నెవూరి నరేష్, ములుగురి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచికల్‌పేట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

## మంత్రి శ్రీధర్‌బాబుకు గ్రామ సర్పంచ్ వినతి

కమాన్‌పూర్, సెప్టెంబర్ 21, (జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ దంపతులు సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెంచికల్‌పేట్ నుంచి రేపల్లెవాడ వరకు రహదారి నిర్మాణం, మొదటి వార్డులో మద్దెల వాగుపై కల్వర్టు నిర్మాణం, 1, 2వ వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఎన్టీపీసీ, సింగరేణి సంస్థల సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేందుకు సహకరించాలని సర్పంచ్ పల్లె మాధవి?నారాయణ మంత్రి శ్రీధర్‌బాబును



కోరారు. గ్రామ సమస్యలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పల్లె మాధవి నారాయణ పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పై కలెక్టర్‌కు మల్లారపు అరుణ్ పిర్యాదు

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 21, (జనంసాక్షి):**



పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ గ్రామంలో ఇటీవల ప్రకటించిన 21 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఒక్క కుటుంబానికి కూడా ఇల్లు కేటాయించలేదని బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్‌కుమార్ అన్నారు. ఈ అంశంపై సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేసి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన అర్హులైన కుటుంబాలకు కనీసం మరో 10 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమాన్‌పూర్ గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు పేద కుటుంబాలు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన అర్హులైన కుటుంబాలను గుర్తించి, వారికి కనీసం మరో 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సామాజిక న్యాయం పాటిస్తూ అర్హులైన పేద కుటుంబాలందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గోవిందారం పాఠశాల విద్యార్థి జశ్వంత్ ఎంపిక

**భీమారం మండలం సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
గోవిందారం జడ్‌పీహెచ్ఎస్ గోవిందారం పాఠశాలకు చెందిన విద్యార్థి బి. జశ్వంత్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల బెల్లంపల్లి లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును కాంశ్య పథకం సాధించడంలో అత్యుత్తమ ప్రదర్శన తో పాటు "బెస్ట్ ఆల్‌రౌండర్" అవార్డును అందుకున్నాడు.క్రీడల పట్ల ఆసక్తి, నిరంతర సాధనతో జశ్వంత్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ నుంచి మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.జశ్వంత్ జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి, జగిత్యాల జిల్లాకు, గోవిందారం పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం జశ్వంత్‌ను అభినందించి, జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మూడు తరాల ఉద్యమ దార్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక మాత్రమే కాదు పతాక కూడా..**

**- తాహసిల్దార్ దాసరి రాజమల్లు**

రామడుగు(జనంసాక్షి):



కొందరు జీవితాంతం తమ కోసమే బ్రతికితే మరికొందరు జీవితాంతం ప్రజల కోసం, వ్యవస్థ కోసమే బ్రతుకుతారు. రెండవ కోవకు చెందిన వ్యక్తి తెలంగాణ ఉద్యమానికి కొండంత అండ తెలంగాణ ఆత్మగౌరవ పతాక, మూడు తరాల ఉద్యమ దార్శనికుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని రామడుగు తహసీల్దార్ దాసరి రాజమల్లు అన్నారు.గోపాల్రావుపేట్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి భవనంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా తహసీల్దార్ దాసరి రాజమల్లు మాట్లడుతూ తెలంగాణ ప్రాంతంలో బాపూజీ గా పిలువబడే కొండాలక్ష్మణ్ తన జీవిత కాలంలో తెలంగాణ కోసం ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అనేక సార్లు ముఖ్యమంత్రి పదవి కూడా వదులుకున్నాడు.ఎన్నో కుల సంఘాలకు సహకార సంఘాలకు మార్గదర్శకత్వం వహించిన బాపూజీ సంఘాలకు నిరంతరం మద్దతిచ్చి ముందుకు సాగే వాడు. సంఘాల రిజిస్ట్రేషన్లు, రిజర్వేషన్లు ,కుల వృత్తి సహకార సంఘాలకు సబ్సిడీలు, రాయితీలు చేనేత అభివృద్ధి, హక్కుల వంటి అంశాలలో అనేక కార్యక్రమాలు చేపట్టి ఆ వర్గాలకు అండగా ఉన్నారు. బహుజనులు అన్ని రంగాలలో సాధికారత సాధించాలని ఆశించిన బాపూజీ అందుకు విద్య మార్గమని విద్యని అందుకోవడానికి హాస్టల్ సౌకర్యాలను సమకూర్చడంలో కృషి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎడవల్లి వనజా నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బుర్ర నరేష్ గౌడ్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కొలిపాక మల్లయ్య, వర్తక సంఘం అధ్యక్షులు కొలిపాక నాగరాజు, పద్మశాలి సంఘం నాయకులు, సిరిపురం మల్లేశం, కొలిపాక శ్రీనివాస్, మచ్చ గంగయ్య, అలవాల శంకర్, మామిడాల నాగరాజు, నల్ల శ్రీనివాస్, గోనె రాజు,కొలిపాక కమలాకర్, సిరిపురం గంగరాజు, కొలిపాక సత్తయ్య , కోలిపాక లక్ష్మణ్, ఆడేటి సంతోష్, కొలిపాక అజయ్, కొలిపాక మల్లేశం, కొలిపాక నాగరాజు, కొలిపాక రాములు, అలువాల జగదీష్, కొలిపాక పురుషోత్తం, కొలిపాక భూమయ్య, కొలిపాక సీతారాములు,పలువురు కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.



## భూమిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత ఆరెపల్లి గ్రామ ఉపసర్పంచ్ గుడికందుల భూమిరెడ్డి నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం మాన కొండూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ఆరెపల్లి గ్రామానికి చేరుకుని భూమిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. భూమిరెడ్డి మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.

## స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**రామడుగు (జనంసాక్షి):**



రామడుగు గ్రామంలో స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ వారి ఆధ్వర్యంలో విగ్రహధాత స్థానిక 7వ వార్డు సభ్యులు ఎండీ ఆరీఫ్ కుల మతాలకు అతీతంగా అన్నదానం,కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు స్థానిక సర్పంచ్,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని కుల మతాలకు అతీతంగా చేపట్టిన ఎండీ ఆరీఫ్, స్ట్రేంజర్స్ యూత్ క్లబ్ రామడుగులకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోయిజ్, ఉప సర్పంచ్ పిందోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

**- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలి**

**- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**రామడుగు(జనంసాక్షి):**
ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సూచించారు. రామడుగు మండల కేంద్రంలో నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. మండలంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.30,88,600 విలువైన చెక్కులను 98 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్,ఎంపీడీఓ రాజేశ్వరి, తహసీల్దార్ దాసరి రాజ మల్లయ్య, ఎస్ఐ కే. రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, సర్పంచులు మోయిజ్,వీర్ల నర్సింగరావు, అంజని ప్రసాద్, పులి ఆంజనేయులు గౌడ్, నునుకొండ అంజలి, శైలజ, మల్లేశం తదితర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




## ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ సవరించాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన నాయకులు**

**గంభీరావుపేట సెప్టెంబర్ 21 జనంసాక్షి;**
గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్‌ను సవరించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ పాయింట్లను సరిచేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు తమ సమస్యను వివరించారు.రోస్టర్ పాయింట్లలో ఉన్న లోపాలను పరిశీలించి తగిన విధంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు.అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎగదండీ అర్జున్ పాల్గొన్నారు. సీనియర్ నాయకులు మల్లెల రాజువీర్ రెడ్డి, మల్ల రాయ నర్సు హాజరయ్యారు.కోళ్లమద్ది సర్పంచ్ ఎడబోయిన దిలీప్ తమ మద్దతు తెలిపారు. మండల ఉపాధ్యక్షులు పల్నాటి దేవరాజు, మంత్రి అంజయ్య, కరికే బాబు, దోసల శంకర్ తదితరులు పాల్గొన్నారు.రోస్టర్ పాయింట్ సవరణపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని నాయకులు కోరారు.

## కురుమ యాదవ భవనానికి రూ.4.30 లక్షలు



**బోయినిపల్లి సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**
మండలంలోని మల్లాపూర్ గ్రామ అమ్లెట్ గ్రామమైన రేగులపల్లిలో కురుమ యాదవ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.4.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం సంఘం సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన నిధులతో భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని సూచించారు.వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కురుమ యాదవ సంఘం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కమ్యూనిటీ భవనం ఉపయోగపడేలా నిర్మాణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామంలోని ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యేకు కురుమ యాదవ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, కురుమ సంఘం నాయకులు వట్టె పోచమల్లు, కోరే కనుకయ్య, ఆకుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు**

## గోవిందారం పాఠశాల విద్యార్థి జశ్వంత్ ఎంపిక

**భీమారం మండలం సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**
గోవిందారం జడ్‌పీహెచ్ఎస్ గోవిందారం పాఠశాలకు చెందిన విద్యార్థి బి. జశ్వంత్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల బెల్లంపల్లి లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును కాంశ్య పథకం సాధించడంలో అత్యుత్తమ ప్రదర్శన తో పాటు "బెస్ట్ ఆల్‌రౌండర్" అవార్డును అందుకున్నాడు.
క్రీడల పట్ల ఆసక్తి, నిరంతర సాధనతో జశ్వంత్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ నుంచి మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.జశ్వంత్ జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి, జగిత్యాల జిల్లాకు, గోవిందారం పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం జశ్వంత్‌ను అభినందించి, జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జనంసాక్షి

### గన్నేరువరం గుట్టపై ఎలుగుబంటి హల్ చల్..

## వెన్నులో వణుకు పుట్టిస్తున్న వీడియోలు!

### ఆదివారం రాత్రి లైవ్ లో ప్రత్యక్షం - వీడియో వైరల్


**గన్నేరువరం, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలో జనం ఇప్పుడు నిద్ర కూడా పోవడం లేదు. కారణం.. గుట్టపై తిష్టవేసిన భారీ ఎలుగుబంటి. ఆదివారం రాత్రి 9:30 గంటలకి గన్నేరువరం - పోతూరు రోడ్డులోని స్మశాన వాటిక దగ్గర ఎలుగుబంటి సంచరిస్తుండగా స్థానిక యువకులు బైక్ లైట్ల వెలుగులో వీడియో, ఫోటోలు తీశారు. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మనుషుల అలికిడితో అది మెల్లగా గుట్ట పైకి వెళ్లిపోయింది.

**నెల రోజులుగా ఇదే తంతు..**

ఇది మొదటిసారి కాదని, గత నెల రోజులుగా వరుసగా మూడోసారి కనిపించిందని గ్రామస్థులు చెబుతున్నారు. పగటి పూట గుట్టపైకి పశువుల కోసం వెళ్లేందుకు, రాత్రి పూట ఆ దారిలో వెళ్లేందుకు జనం హడలిపోతున్నారు. గుట్టకు కొంత దూరంగా ఉన్న 50 కుటుంబాలు పిల్లలను బయటకు రానివ్వడం లేదు.

**అధికారులు చూసీ చూడనట్లు..**

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అటవీశాఖ అధికారులు తూతూ మంత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్ప బోను పెట్టడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గుట్ట వద్ద గాలింపు చేపట్టి, బోను ఏర్పాటు చేసి ఎలుగుబంటిని బంధించి అడవిలో వదలాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.





### పెన్షన్ లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**

వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలో సోమవారం పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమని ప్రత్యేక అధికారి సాయికిరణ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముత్త సంజన మహేష్, ప్రత్యేక అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ లబ్ధిదారుల పెన్షన్‌కు సంబంధించిన అర్హతలను పరిశీలన చేశామన్నారు.లబ్ధిదారుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి,సంబంధిత రికార్డులను తనిఖీ చేశామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా పారదర్శకంగా వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ లబ్ధిదారుల సమస్యలను తెలుసుకున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా గ్రామస్థాయిలో అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

## బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ కు 'చాంద్ సితారె' తొలి పురస్కారం

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**

సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డి పేటకు చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, రంగినేని పిల్లల పండుగ కన్వీనర్, ప్రముఖ బాల సాహిత్య వికాస కార్యకర్త, మానసం పూర్వ కార్యనిర్వాహక అధ్యక్షులు గరిపెల్లి అశోక్ ను ఖమ్మం చాంద్ సితారె సంస్థ తమ తొలి బాల సాహిత్య పురస్కారం "చాంద్ సితారె" పురస్కారం'2026 ప్రదానం చేసి సత్కరించింది. ఖమ్మంలోని పి.ఆర్.టి.యు భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు, బాల వికాసకారులు షఫీ అధ్యక్షత వహించగా, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురిమళ్ళ సునంద, నామా పురుషోత్తం, కట్టా శేఖర్‌రావు, బోళ్ళ వీరబ్రహ్మం, కన్నెగంటి వెంకటయ్య, పోతగాని సత్యనారాయణ, బండి ఉష, కొమ్మవరపు కృష్ణయ్యలు అతిథులుగా పాల్గొన్నారు. చాంద్ సితారె సంస్థ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ తమ తొలి పురస్కారాన్ని తెలంగాణలో బాల సాహిత్య వికాసోద్యమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్న సిరిసిల్ల ద్వయం గరిపెల్లి అశోక్ ' పత్తిపాక మోహన్ లలో ఒకరైన గరిపెల్లి అశోక్‌కు ప్రదానం చేయడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. అతిథులు శాలువా, పూలమాల, ప్రశంసా పత్రంతో సత్కరించి తెలంగాణలో గరిపెల్లి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, ఈ చాంద్ సితారె పురస్కారం చంద్రునికో నూలుపోగులాగా, బాలతారకు వెలుగు సితారలాగా అందిస్తున్నామని అన్నారు. అటుతరువాత అభిమానంతో గరిపెల్లికి విచ్చేసిన అతిథులు చేసిన సత్కారం దాదాపు నలభైనిమిషాలు సాగడం విశేషమేకాదు, ఆయనపట్లవున్న అభిమానానికి నిదర్శనమని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలోని అందరు బాల సాహితీవేత్తలతో పాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన బాల సాహితీవేత్తలు పాల్గొన్నారు. గరిపెల్లి అశోక్ ఈ పురస్కారం అందుకోవడం పట్ల సిరిసిల్లకు చెందిన సాహితీవేత్తలు జూకంటి జగన్నాథం, పత్తిపాక మోహన్, ఆడెపు లక్ష్మణ్, ఎలగొండ రవి, టి.వి. నారాయణ, గెంట్యాల భూమేష్, మడూరి అనిత, ఈడెపు సొమ్య, శ్రీమతి, దూడం గణేష్, అంకారపు రవి, బూర దేవానందం తదితరులు అభినందనలు తెలిపారు.




### అర్జీ-1, అర్జీ-2 నియర్‌బై ఏరియా వాలీబాల్ పోటీల్లో అర్జీ-2 జట్టు విజయం

**కంపెనీ స్థాయి పోటీలకు 12 మంది క్రీడాకారుల ఎంపిక**



**యైటింక్లైన్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** చిఖుడఉం 2026-27 క్రీడల్లో భాగంగా అర్జీ-1, అర్జీ-2 ఏరియాల నియర్‌బై ఏరియా వాలీబాల్ ఎంపిక పోటీలు సోమవారం అబ్దుల్ కలాం స్టేడియంలో నిర్వహించారు. అర్జీ-1, అర్జీ-2 ఏరియాలకు చెందిన నియర్‌బై జట్ల మధ్య జరిగిన ఈ పోటీలో అర్జీ-2 జట్టు విజయం సాధించింది.అనంతరం కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. కంపెనీ స్థాయికి టి. రవికృష్ణ, ఏ. సందీప్, ఈ. తిరుపతి, ఈ. ప్రవీణ్ కుమార్, యు. నరేష్, బి. సునీల్ పృథ్వీ, బి. రవి కుమార్, వి. శ్రావణ్, పి. రాజుకుమార్, ఏ. రవి, పి. అనిల్ కుమార్, కె. శ్రీనివాస్ ఎంపికయ్యారు.స్టాండ్‌బై క్రీడాకారులుగా ఆర్. విద్యాసాగర్, వి. శ్రీరామ్‌లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ అక్రం, జనరల్ కెప్టెన్ ఏ. రవీందర్ రెడ్డి పాల్గొని విజయం సాధించిన అర్జీ-2 జట్టుతో పాటు కంపెనీ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

### ఆయుర్వేదం మన జీవనవేదం

**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవం లో భాగంగా సోమవారం పోష నా అభియాన్ 2 వార్డు, 14వ వార్డ్ అంగన్వాడీ సెంటర్లో మహిళలకు పిల్లలకు వృద్ధులకు వారు రోజు తీసుకునే ఆహారంలో ఏమేమి ఉండాలో వాటి వల్ల ఆరోగ్యం ఎలా పొందాలో వివరిస్తూ అలాగే ఆయుర్వేదం అనేది మన జీవన వేదమని ఆయుర్వేదం వల్ల ఆయుష్ ఆరోగ్యం ఉంటుందని, ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరక మానసిక వ్యాధుల నుండి విముక్తి పొందవచ్చుని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో 2 వార్డ్ కౌన్సిలర్ వేముల రాములు, 14 వార్డ్ కౌన్సిలర్ వెంగల లీల, సిరిసిల్ల యునాని డిస్పెన్సరీ డాక్టర్ నస్రిన్, డిపిఎం తిరుపతి, యోగా శిక్షకులు శ్రీనివాస్, స్వప్న, వార్డ్ ఆఫీసర్స్ మహేష్ రమేష్,ఆశా వర్కర్స్ సుజాత, వర్ష, లావణ్య, లక్ష్మి , అంగన్వాడి టీచర్ ఉమా, వనిత ఆయాలు మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

## బ్రిడ్జి కోసం అనంతారం యువకుడి ఆమరణ నిరాహార దీక్ష

### పట్టించుకునే పాలకులే కరువు.. పనులు ప్రారంభించే వరకు దీక్ష కొనసాగిస్తానన్న నాగరాజు

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):** ఇల్లంతకుంట మండలంలోని అనంతారం? ఇల్లంతకుంట గ్రామాల మధ్య బిక్కవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే పాలకులు కరువయ్యారని నిరసిస్తూ అనంతారం గ్రామానికి చెందిన యువజన నాయకుడు అక్కెం నాగరాజు సోమవారం బ్రిడ్జిపై ఆమరణ నిరాహార దీక్షకు దిగారు.ఈ సందర్భంగా గ్రామ యువకులతో కలిసి బ్రిడ్జికై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నాగరాజు దీక్ష చేపట్టారు. పలువురు బీజేపీ నాయకులు ఆయన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అక్కెం నాగరాజు మాట్లాడుతూ.. బిక్కవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా మిగిలిన పనులను పూర్తి చేయడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో ప్రతిరోజూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రయాణ సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేసే వరకు తన ఆమరణ నిరాహార దీక్షను విరమించేది లేదని నాగరాజు స్పష్టం చేశారు. బిక్కవాగు బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ యువకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు

**సదాశివనగర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
సదాశివనగర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సౌదీ అరేబియాలో రాజలింగంపేట గ్రామవాసి మృతి

**ఉమ్మడి మేడిపల్లి,సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**



జగిత్యాల జిల్లా రాజ లింగంపేట గ్రామానికి చెందిన సుంకపాక చిన్న గంగా రాజం 13/9/2026 న ఉదయం నాలుగు గంటలకు డ్యూటీ కి వెళుతుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగి అక్కడికక్కడే మరణించడం జరిగింది. మృతుని భార్య ఇటీవలే మరణించగా, ఒక కూతురు 18 సంవత్సరాలు,కుమారుడు27 సంవత్సరాలు ఉన్నారు. ఇంటి ఆర్థిక పరిస్థితి బాగో లేక కుటుంబ పోషణకై గల్ఫ్ దారి పట్టడం జరిగింది. ఈ విషాదం జరగడం వల్ల వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయారు.ఇలా జరగడం చాలా బాధాకరణీయమని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.తేది 21/9/2026 సోమ వారం రోజున మృతదేహం స్వగ్రామానికి తీసుకు వస్తున్నారని కుటుంబ సభ్యులు వెల్లడించారు .ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## దివ్యాంగుడికి.. దిక్కెవరు..?

**ముస్తాబాద్ సెప్టెంబర్ 21(జనంసాక్షి)**



జీవనభృతి కోసం తిరగని చోటు లేదు.. మంత్రులను కలిసిన కనికరం చూపడం లేదు... కలవని అధికారులు లేరని అంటూ సోమవారం ఏదైనా ఉద్యోగం కల్పించాలని ప్రజావాణి లో కలెక్టర్ కు మొరపెట్టున్నాడు. ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామానికి చెందిన మినుప రాజు తన తండ్రి గత సం " క్రితం మృతి చెందడం తో ఇంటి పెద్దదిక్కు లేకపోవడం తో జీవన ఉపాధి నెలకు ఒరిగింది.అమ్మ కు ఆరోగ్యం సహకరించక పోవడం తో కుటుంబ పోషణ భారం తనపై వెయ్యకూడదని తన సొంత చేతుల మీదుగా తల్లి ని పోషించుకువాలని ఏదైనా ప్రైవేట్ ఉద్యోగం కల్పించాలని అధికారులను వేడుకుంటున్నాడు. మంత్రులను కలిసిన కనికరం లేదని.... అడగని అధికారులు లేరని... ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దివ్యాంగుడిగా ఉన్న నన్ను చూసి ఎవ్వరు కనికరం చూపడం లేదని రోదిస్తున్నాడు.ఏదైనా ప్రైవేట్ ఉద్యోగం కల్పించి కుటుంబ పోషణ కు సహకరించి మా కుటుంబాన్ని ఆదుకోవాలని మినుప రాజు ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశాడు.

## ప్రజావాణిలో కార్యదర్శి పై ఫిర్యాదు

**ముస్తాబాద్ సెప్టెంబర్ 21( జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం మండలం మోహిని కుంట గ్రామపంచాయతీలో పనిచేస్తున్నటువంటి కారోబార్ పై ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు మెరుగు లింగం, పోచమ్మల వనిత, రుద్రోజు శివకుమార్, వీరితో పాటు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలపై అయినా కారోబార్ దగ్గరకి వస్తే సరి అయిన సమాధానం చెప్పకుండా దురుసుగా ప్రవర్తిస్తూ గ్రామస్తులను ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.




## బంగారు ఆభరణాల కోసం మహిళ హత్య

**నిందితుడికి జీవిత ఖైదు..**

**శాస్త్రీయ దర్యాప్తుతో నేరం రుజువు చేసిన పోలీసులు..**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనంసాక్షి :**
నిజామాబాద్ జిల్లా నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. బంగారు ఆభరణాల కోసమే ఓ మహిళను అత్యంత క్రూరంగా హతమార్చిన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జిల్లా ఌ సెషన్స్ జడ్జి (ఫ్యామిలీ ఌ ఉమెన్స్ కోర్టు) సోమవారం తీర్పు చెప్పారు.నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 నవంబర్ 25వ తేదీన ఈ హత్యోదంతం చోటు చేసుకుంది. మోస్రా గ్రామానికి చెందిన కుమురం ఏ పాండవాల సాగర్ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. మృతురాలు ఆకుల అనంత ఏ సోనీ (29) మల్కాపూర్ గ్రామానికి చెందిన గృహిణి. నిందితుడు మృతురాలికి బంధువు కావడంతో తరచూ ఆమె ఇంటికి వచ్చిపోయేవాడు. ఈ క్రమంలో ఆమె మెడలోని బంగారు ఆభరణాలపై కన్నేసిన నిందితుడు, ఆమె తల్లి ఇంట్లో లేని సమయం చూసి ఒంటరిగా ఉన్న మహిళను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అపహరించి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

**శాస్త్రీయ దర్యాప్తు, కోర్టు తీర్పు..**

నార్త్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నవీపేట్ పోలీస్ సిబ్బంది ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎలాంటి తప్పులకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో బలమైన ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో ప్రాసిక్యూషన్ తరఫున అందించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించింది.ఈ కేసుకు సంబంధించి కోర్టు నిందితునికి కఠిన శిక్షలు ఖరారు చేసింది.బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద జీవిత ఖైదు మరియు రూ.5,000/- జరిమానా (జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల సాధారణ జైలు శిక్ష), బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద 1 సంవత్సరం కఠిన కారాగార శిక్ష మరియు రూ.2,000/- జరిమానా (జరిమానా చెల్లించకపోతే 6 నెలల సాధారణ జైలు శిక్ష), ఈ రెండు శిక్షలు ఏకకాలంలో (కాన్‌కరెంట్‌గా) అమలవుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను వినిపించారు.

**అధికారుల అభినందనలు..**

కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, నిందితుడికి చట్టపరమైన శిక్ష పడేలా బలమైన సాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టిన పోలీస్ అధికారులను జిల్లా కమిషనర్ అభినందించారు. నార్త్ రూరల్ సీఐతో పాటు, ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన నవీపేట్ ఎస్సై, కోర్టు లైజన్ అధికారులు మరియు సీఎంఎస్, సీడీఓ సిబ్బంది సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.నేరాలకు పాల్పడేవాళ్లకు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉండదని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు నిజామాబాద్ పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఈ సందర్భంగా పోలీస్ శాఖ స్పష్టం చేసింది.



## తాడికల్ సర్పంచ్ దుర్గపు సుజాత మృతి

**అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**శంకరపట్నం సెప్టెంబర్ 20 జనంసాక్షి**
మండలంలోని తాడికల్ గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆమె ఆరోగ్యం కుదుటపడడంతో ఇంటికి వచ్చారు. అయితే ఆదివారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. సర్పంచ్‌గా ఎన్నికైన కొద్దికాలానికే ఆమె మృతి చెందడంతో తాడికల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, బంధువులు, కాంగ్రెస్ నాయకులు సుజాత మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.విషయం తెలుసుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తాడికల్‌కు చేరుకుని సుజాత భౌతికకాయాన్ని సందర్శించారు. ఆమె భౌతికకాయంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని స్వయంగా పాడె మోశారు. సుజాత మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, పార్టీ జిల్లా కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బందారి తిరుపతి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సిహెచ్. రాజు

**కామారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**



కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ నెల 20న నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిహెచ్. రాజు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా బి. భాస్కర్ రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్. నగేష్, సహాయ కార్యదర్శిగా జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జి. లక్ష్మణ్, నాగరాజు, సిహెచ్. శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు.జిల్లాలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ప్రతిభావంతులైన కబడ్డీ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## జెండా గుడిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
ఇందూరు నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితికి ముందు ఇందూరులో జెండా ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా తాను జెండా జాతరలో పాల్గొంటున్నానని గుర్తు చేసుకున్నారు. జెండాను నగర పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగింపు తీయడం, బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు తాను పూజించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మారావార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**ఇందూరులో ఉత్సాహంగా గణపతి పూజలు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనం సాక్షి:**
ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ, విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం చేత 'ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా' గుర్తింపు పొందిన బొబ్బిలి మధుసూదన్ ను ఇందూరు ప్రజలు, యువత ఘనంగా సత్కరించారు. సోమవారం నాడు ఎలమగుట్టలోని శ్రీ విశ్వజ్యోతి యువజన గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బొబ్బిల్లిగల్లి, ఇందూరు వాసులు మరియు శ్రీ విశ్వజ్యోతి యూత్ సభ్యులు బొబ్బిలి వినేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మధుసూదన్ చేస్తున్న కృషి అభినందనీయమని, ఆయన రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందడం ఇందూరు ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఉపాధ్యాయునికి అభినందనలు తెలిపారు. గణనాథుని సన్నిధిలో జరిగిన ఈ వేడుకలో యూత్ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంచుకుంటూ పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు.



# ఏకరూప దుస్తులతో విద్యార్థుల్లో సమానత్వ భావన

## పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో దుస్తులు, షూస్, బ్యాగుల పంపిణీ

**సిరికొండ, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**
సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, టై, బెల్టు, షూస్, బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సమానత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఉపసర్పంచ్ శోభన్, గ్రామభివృధి కమిటీ అధ్యక్షులు దేగం సాయన్న, ఐకేపీ సి సి సత్యానంద్, ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.సర్పంచ్ మల్లెల సాయిచరణ్ మాట్లాడుతూ ఏకరూప దుస్తులు విద్యార్థుల్లో భేదభావాలను తొలగించి సమానత్వ భావనను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఉపసర్పంచ్ శోభన్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, పరిశుభ్రత పాటిస్తూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. దేగం సాయన్న మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, మంచి నడవడి, సేవాభావం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని అన్నారు.ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పరిశుభ్రమైన ఏకరూప దుస్తులతో పాఠశాలకు హాజరై నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సాంకేతిక, సృజనాత్మక రంగాల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.కొత్త దుస్తులు, షూస్, బ్యాగులను




అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి పాఠశాల తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సాదాసీదాగా సాగిన మహాజన సభ..

### యూరియాపై అదనపు చార్జీలు ఎత్తివేయాలి: రైతులు

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని సొసైటీలో సోమవారం చైర్మన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన అర్ధ వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సందీప్ కుమార్ అర్ధ వార్షిక నివేదికను సభాముఖంగా చదివి వినిపించారు. జమ ఖర్చుల ఆమోదం, 2025-2026 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్ట్ ఆమోదం, యూరియాపై అదనంగా విధిస్తున్న రవాణా చార్జీలను తొలగించాలని తీర్మానం చేశారు. తదనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం తీసుకున్న రైతులకు షేర్స్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్యామప్ప పటేల్, మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, పండరి, సంజీవ్, బస్వరాజ్ దేశాయ్, బీజేపీ యువ నాయకులు తానాజీ రావు, సంఘ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జన శోభయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్

### ప్రశాంత వాతావరణంలో నిమజ్జన శోభయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనం సాక్షి)**
కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన శోభయాత్ర ఏర్పాట్లను మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. శోభయాత్ర సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా శోభయాత్ర కొనసాగే మార్గాల్లో రహదారుల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, పోలీసు బందోబస్తు తదితర అంశాలను చైర్పర్సన్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
నిమజ్జన శోభయాత్ర సమయంలో ప్రజలు, భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, ప్రధాన మార్గాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. అలాగే తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు.నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, సీఐ నరహరి, ఎస్ఐలు, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీఓ వినీత్, కౌన్సిలర్లు షేరు, ఆన్వార్, చిట్టిబాబు, లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ డీఈ నందకుమార్, మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖ సిబ్బంది, నాయకులు నాగరాజు, అశ్రర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలు వినియోగించుకోవచ్చు పోలీస్ కమిషనర్ వెల్లడి

### ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాది దారుల నుండి 31 ఫిర్యాదులను స్వీకరన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనంసాక్షి:** నిజామాబాద్ జిల్లా ప్రజలు నిర్భయంగా పోలీసువారి సేవలను వినియోగించుకోవచ్చని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో 31 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ మరియు సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేశారు.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ తెలియజేశారు.ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలిపారు.

## సిరికొండ మండలంలో ప్రజావాణికి 10 ఫిర్యాదులు

### రెవెన్యూ సమస్యలపైనే అధికంగా వినతులు



**సిరికొండ, సెప్టెంబర్ 21 (జనం సాక్షి):**
సిరికొండ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 10 ఫిర్యాదులు, వినతులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే అధికంగా ఉండటం గమనార్హం. రెవెన్యూ శాఖకు 8 ఫిర్యాదులు అందగా, పోలీస్ శాఖకు ఒకటి, నిజామాబాద్ డీటీడీవోకు సంబంధించి ఒక ఫిర్యాదు నమోదైంది. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.



## విద్యార్థినుల ఆరోగ్యానికి హెచ్‌పీవీ టీకా రక్షణ

### సిరికొండ ఆదర్శ పాఠశాలలో 14-15 ఏళ్ల బాలికలకు టీకాలు

**సిరికొండ, సెప్టెంబర్ 21 (జనం సాక్షి ):**
సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 14 సంవత్సరాలు నిండిన, 15 సంవత్సరాలలోపు వయస్సు గల అర్హులైన విద్యార్థినులకు మానవ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) నిరోధక టీకాలు అందించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యురాలు ప్రణవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన విద్యార్థినులకు టీకాలు అందించారు.
ఈ సందర్భంగా వైద్యురాలు ప్రణవి మాట్లాడుతూ మానవ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) నిరోధక టీకా ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వైరస్‌కు సంబంధించిన కొన్ని వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో టీకా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అర్హత కలిగిన వయస్సులో టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థినులు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. పాఠశాలలో ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది సూచనలను పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం రాజేష్ రెడ్డి, వైద్యురాలు ప్రణవి, పర్యవేక్షకురాలు నిర్మల, సహాయక నర్సు స్వరూప, ఆశా కార్యకర్త శ్వేత, విద్యార్థినులు పాల్గొన్నారు.



# రైతు హామీల అమలుకై 27 నుండి కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర



○బోధన్ టు జగిత్యాల 180 గ్రామాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర

○బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులచారి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనంసాక్షి:**
రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 27 నుండి కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర బోధన్ నుండి జగిత్యాల వరకు 180 గ్రామాల మీదుగా సైకిల్ యాత్ర కొనసాగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి తెలిపారు. సోమవారంబిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పి.తిరుపతి రెడ్డి అధ్యక్షతన సైకిల్ యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా దినేష్ పటేల్ కులచారి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ సైకిల్ యాత్రను ఈ నెల 27వ తేదీన బోధన్ నుండి ప్రారంభమై, అక్టోబర్ 4వ తేదీన జగిత్యాల వరకు దాదాపు 180 గ్రామాల మీదుగా కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు**
షరతులు లేకుండా రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి,కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలి,అన్ని రకాల వడ్లకు బోనస్ అందించడంతో పాటు, మేనిఫెస్టోలో పేర్కొన్న 10 రకాల పంటలకు బోనస్ చెల్లించాలి,వ్యవసాయ రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సాయం అందించాలి, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలి,నిజామాబాద్ నగరంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలి,నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్), ముత్యంపేట్ చక్కెర కర్మాగారాలను తెరిపించాలి,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఈఖూ) తగిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలి తదితరరైతుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో అన్నదాతలు, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ..దశాబ్దాల ఇందూర్ రైతాంగ కల అయిన జాతీయ పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోదీ మంజూరు చేస్తే,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎరువులపై లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ భరిస్తూ, పీఎం-కిసాన్ ద్వారా ప్రతి ఏటా ఆర్థిక సాయం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను మోసం చేస్తుందన్నారు.రైతుల హక్కుల సాధనకై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో రైతులు అధిక సంఖ్యలో కదలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కిసాన్ మోర్చ నాయకులు వెల్మ గంగారెడ్డి, అంతిరెడ్డి హరీష్ రెడ్డి, తోట చిన్నయ్య, జిల్లా పదాధికారులు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## విజయ్ హై స్కూల్ కు షోకాజ్ నోటీసులు జారీ

**ఆర్మూర్,సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
ఆర్మూర్ సబ్ కలెక్టర్ ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు పట్టణంలోని విజయ్ హై స్కూల్ కు సోమవారం మండల విద్యాశాఖ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.విజయ్ హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్న నైనిషా ఆరోను గత విద్యా సంవత్సరం నుండి పాఠశాల యాజమాన్యం వేధిస్తోందని తల్లి జోహన్నా డౌపాలా ప్రజావాణి ఫిర్యాదుతో తెలిపింది.ఈ మేరకు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని పాఠశాల యాజమాన్యానికి నోటీసులో తెలిపారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి 6.5 కంటి దృష్టి ఉందని తెలిపారు.
యూనిఫాం ధరించమని బలవంతం చేయడం,శారీరకంగా హింసించడం,మానసికంగా మాటలతో వేధింపులకు గురి చేయడం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



## స్పీకర్లకు అనుమతించాలని ఏసిపి,సిఐకి వినతి

**ఆర్మూర్,సెప్టెంబర్ 21 (జనంసాక్షి):**
గణేష్ నిమజ్జన శోభాయాత్రకు స్పీకర్లకు అనుమతించాలని ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డికి,సీఐ సత్యనారాయణ గౌడ్ కి ఆర్మూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. నిమజ్జన శోభాయాత్రకు రెండు టాప్ బాక్సులకు,ఒక బేస్ బాక్సుకు అనుమతి ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కౌన్సిలర్లు గోనె రఘు,నర్మె నవీన్,గుపాల భుపెందర్,తాటి హన్మాండ్లు, గంగాధర్ గౌడ్,బాబ్య్యా,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వాలి

**ప్రజావాణిలో సిరికొండ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ వినతి**

**సిరికొండ, సెప్టెంబర్ 21 (జనం సాక్షి ):**
సిరికొండ గ్రామ పరిధిలో ఇందిరమ్మ ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిరికొండ గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సిరికొండలో సుమారు 20 సంవత్సరాల క్రితం ఎస్సీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసి, వారికి కేటాయించిన భూములను అధికారులు చూపించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయా ప్లాట్లలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.అదేవిధంగా కొండూరు రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో ఇతర నిరుపేదలకు గతంలో పట్టాలు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటివరకు వారికి కేటాయించిన ప్లాట్లను చూపించలేదని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే సంబంధిత లబ్ధిదారులకు ప్లాట్లను చూపించి, అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు కల్పించాలని సర్పంచ్ మల్లెల సాయిచరణ్ కోరారు.నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించిన భూములు వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు





## ఐడిఓసి కాంప్లెక్స్‌లో తల్లులు పిల్లలకు పాలిచ్చే క్యాబిన్లు ప్రారంభం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 జనంసాక్షి:**
నిజామాబాద్ మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం (ఆఊఇచి) ఆధ్వర్యంలో, బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ఐడిఓసి కాంప్లెక్స్‌లో తల్లులు తమ చిన్నారులకు సౌకర్యవంతంగా, గోప్యతతో పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్లను సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని గీత, జిల్లా రెవెన్యూ అధికారి, రాజశ్రీ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, కృష్ణవేణి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, సౌందర్య, జిల్లా సంక్షేమ అధికారిలు ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఉద్యోగులు, సందర్శకులు మరియు ఐడిఓసి కాంప్లెక్స్‌కు వచ్చే తల్లులు తమ శిశువులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఈ క్యాబిన్లు ఉపయోగపడతాయని తెలిపారు. శిశువులకు తల్లిపాలు అందించడం వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం మరియు మహిళల సాధికారతకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. తల్లులు మరియు శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫర్హత్ డిచ్పల్లి సిడిపిఓ,శ్రీనివాస్ సూపరింటెండెంట్, మహిపాల్ సీనియర్ అసిస్టెంట్, కుమారి ప్రణతి ఇా, ఆఊఇచి -ఆఓఅ స్వప్న , జెండర్ స్పెషలిస్ట్ లు, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షి లిటరసీ, అకౌంటెంట్ లు మరియు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు వినాయకుని మండపాలను సందర్శించిన మానాల మోహన్ రెడ్డి

**బాల్కొండ న్యూస్ 21 సెప్టెంబర్ ( జనంసాక్షి)**
బాల్కొండ మండలంలో ఇత్వర్ పేట్, జలాల్పూర్, కిసాన్ నగర్ మరియు బాల్కొండ గ్రామాలలో వినాయకుడి మండపాలను సందర్శించిన మాజీ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి .
ఈత్వార్ పేట్ అంబేద్కర్ యువజన సంఘం వద్ద జలాల్పూర్ లో అంబేద్కర్ యువజన సంఘం వద్ద కిసాన్ నగర్ శివాలయం యూత్ వద్ద బాల్కొండలో ంః యూత్,హిందూస్ పవర్ యూత్,మౌటైన్ పవర్ యూత్, రైజర్స్ యూత్ ల వద్ద వినాయకుని దర్శించుకోని పూజా కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని రైతులందరూ పాడిపంటలతో సంతోషంగా ఉండాలని కోరారు. వినాయకుని మండపల సభ్యులకు వినాయకుని నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల ప్రెసిడెంట్ ప్రవీణ్ వెంకటేష్ గౌడ్ సర్పంచ్ మోహన్ రెడ్డి సర్పంచ్ సంతోష్ ప్రవీణ్ గౌడ్ కిషన్ గంగాధర్ సంజీవ్ వాజిద్ రవి తౌడు గంగాధర్ శ్రీను కపిల్ నగేష్ యుసిప్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

## బాపూజీ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి: మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21(జనంసాక్షి )**
తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలను కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ తన ఎమ్మెల్యే పదవితో పాటు మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, తన పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యతనిచ్చిన ధీరుడు బాపూజీ అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజానికి మార్గదర్శిగా నిలిచారని అన్నారు. ఆయన చేసిన త్యాగాలు, ప్రజా సేవ, తెలంగాణ సాధన కోసం సాగించిన పోరాటాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బాపూజీ ఆశయాలు, సిద్ధాంతాలను ఆచరణలో కొనసాగించినప్పుడే ఆయనకు అందించే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు సబ్బని కృష్ణ హరి, ప్రధాన కార్యదర్శి గుర్రపు నరసింహస్వామి, బీసీ సంఘం అధ్యక్షులు సాప శివరాములు, నీల నాగరాజు, ఆమెర్, కోశాధికారి అల్వాల గోపాల్, గౌరవాధ్యక్షులు బొమ్మరి రాజయ్య, ఉపాధ్యక్షులు పడిగే శ్రీనివాస్, పోచమ్మల శ్రీనివాస్, ప్రశాంత్, అరుణ్, నితిన్, నితీష్, మధు తదితరులు పాల్గొన్నారు.







## చేయూత పింఛన్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**
జిల్లా కేంద్రంలోని కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 49వ వార్డులో నిర్వహించిన చేయూత పింఛన్ల పరిశీలన (వెరిఫికేషన్) కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేయూత పింఛను లబ్ధిదారుల వివరాలను పరిశీలించిన చైర్‌పర్సన్, వెరిఫికేషన్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ హన్మాంతారావు, కౌన్సిలర్లు షేరు, అన్వార్, నాయకులు అశ్రర్, నాగరాజు, శ్రీనివాస్, చేయూత పింఛను లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఐవి వ్యాప్తి నివారణకు అవగాహనే ఆయుధం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి..

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి)**
హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కామారెడ్డి జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాలను సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. హెచ్ఐవి వ్యాప్తిని నివారించడంలో ప్రజల్లో అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్య అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించేందుకు కళాజాత, పల్లె సుద్దుల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హెచ్ఐవి వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అపోహలు?వాస్తవాలు, హెచ్ఐవి పరీక్షలు, చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి హెచ్ఐవి నివారణపై చైతన్యం పెంపొందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రతిరోజూ రెండు షోల చొప్పున కళాజాత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వెంకటి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్, డిప్యూటీ డెమో వేణుగోపాల్, డీపీఎం సుధాకర్, ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, నందిని కళాజాత బృందం సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణంతో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు

## స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21( జనం సాక్షి)
మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగుదల, స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా స్త్రీనిధి ద్వారా రుణ సహాయం అందించి కొనుగోలు చేసిన మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. స్త్రీనిధి ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.3 లక్షల చొప్పున ఇద్దరు లబ్ధిదారులకు మొత్తం రూ.6 లక్షల రుణ సహాయం అందించినట్లు అధికారులు తెలిపారు. దేశాయిపేట ఎూ పరిధిలోని సాయి నందిని గ్రూప్‌కు చెందిన మాసన్‌పల్లి రజిత, సోమలింగేశ్వర గ్రూప్‌కు చెందిన బేపారి శోభ ఎలక్ట్రిక్ ఆటోలను పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా స్త్రీనిధి ద్వారా అందిస్తున్న రుణ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు వివిధ రకాల రుణ సహాయ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్త్రీనిధి రుణాలతో ఆదాయం సమకూర్చే ఉపాధి మార్గాలను ఎంచుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా లబ్ధిదారులు నిరంతర ఆదాయం పొందేలా కృషి చేయాలని, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.



ప్రభుత్వం అందిస్తున్న రుణ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మరింత మంది మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి కార్యకలాపాల వైపు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఆర్‌ఓ పాండు, స్త్రీనిధి ఆర్‌ఎం కిరణ్, స్త్రీనిధి మేనేజర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్, సంబంధిత అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం.!

ఆర్మూర్, సెప్టెంబర్ 21 (జనంసాక్షి):
అనుమతులు లేకుండానే ఇంటి నిర్మాణం చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ యదేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుపుతున్నారు. ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణ చేపడుతున్న నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. అక్రమ నిర్మాణదారుడు అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడు. రాజకీయ నాయకుల అండతో ఎవరు ఏం చేయలేరని యదేచ్ఛగా అక్రమ నిర్మాణం చేపడుతున్న గ్రామపంచాయతీ అధికారులు సైతం ఆ నిర్మాణం పై కన్నెత్తి చూడడం లేదు. గ్రామపంచాయతీ పరిధిలో అధికారులకు గత మూడు నెలల క్రితమే ఇట్టి నిర్మాణం పై పలు ఫిర్యాదులు అందిన నోటీసులు పంపి చేతులు దులుపుకున్నారు. గ్రామపంచాయతీ అధికారులు ఇరిగేషన్ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణానికి ఎన్ఓసి తీసుకొని గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణదారుడు గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యదేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుపుతున్నాడు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



**ఎలాంటి అనుమతులు లేవు.. - సెక్రెటరీ శ్రీధర్**
ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామపంచాయతీ పరిధిలో మహేందర్ నిర్మిస్తున్న ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవు. తదుపరి చర్యగా నోటీసులు అందించాం. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని పనులు ఆపివేయాలని ఆదేశించాం. ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు గ్రామపంచాయతీలో అందించలేదన్నారు. మరోసారి నోటీసులు అందించి తదుపరి చర్య దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం.



## యూనియన్ బ్యాంక్ గృహ రుణాలు

**-ఇళ్ల నిర్మాణం,మరమ్మతులకు తక్కువ వడ్డీకే బ్యాంక్ రుణాలు**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేక గృహ రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.రీజినల్ హెడ్ కె. నటరాజ్ సూచనల మేరకు పెద్దపల్లి జెండా రోడ్డులోని బ్యాంకు శాఖలో ఈ పథకంపై ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రిటైల్ లోన్ విభాగం అధిపతి సంతోష్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఇంటి నిర్మాణంతో పాటు ఇళ్ల మరమ్మతులు,పునరుద్ధరణ పనులకు కూడా ఈ రుణ సదుపాయం వర్తిస్తుందని స్పష్టం చేశారు.ఆసక్తి ఉన్నవారు జన్-సమర్థ్ అంతర్జాల వేదిక ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.పూర్తి వివరాలు,అర్హతల కోసం సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను గానీ,రిటైల్ లోన్ విభాగాన్ని గానీ సంప్రదించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ వైకుంత రావు,బ్యాంకు సిబ్బంది,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**- మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని లిజిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్షలి మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను సోమవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.సెప్టెంబర్ 23న స్థానిక ఆయుష్ వింగ్స్ హాస్పిటల్, జిల్లా ఆసుపత్రి,పెద్దపల్లిలో జరిగే ఈ మెగా హెల్త్ ఆయుర్వేద క్యాంప్‌ను పెద్దపల్లి జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ జి.ఎన్. అరుణ,ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి. శోభారాణి, వైద్యాధికారులు డాక్టర్ కె.అమర్‌నాథ్, డాక్టర్ వి.మారుతి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్. విద్యాసాగర్,తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపల్లి గ్రామంలో ఘనంగా కుంకుమ పూజ, అన్నదాన కార్యక్రమం

**పెద్దపల్లి రూరల్,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**



పెద్దపల్లి మండలం గుర్రంపల్లి గ్రామంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శ్రీ గణేష్ మండపం వద్ద భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ స్వామి ఆశీస్సులతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,యువత, మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్నామని శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు, భక్తులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కోమటిపల్లి రాజేందర్, వార్డు సభ్యులు కొట్టే శంకర్,కంకణాల తిరుపతిరెడ్డి,మధుగాని సంపత్ , మాదిరెడ్డి భాస్కర్ రెడ్డి,దామోదర రవి,రెడ్డి శ్రీకాంత్,కోమటిపల్లి సదానందం,మొలుమూరి అజయ్,గొంట్ల గణేష్,తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ మండప నిర్వాహకులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి సాయి గార్డెన్‌లో గణేష్ నవరాత్రుల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల గణేష్ మండప నిర్వాహకులకు రూరల్ ఎస్ ఐ ఎం.మధుకర్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామీణ ప్రాంతాల గణేష్ మండప నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసిపి జి కృష్ణ, సిఐ కే ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని, నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, డీజేలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు.ఉత్సవాల సమయంలో పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగుండం మండలం గోదావరిఖని సిక్కు వాడకు చెందిన మేదరి లలిత తన కూతురు మేదరి సౌజన్య తన పేరు మీద ఉన్న ఇల్లును రిజిస్ట్రేషన్ చేసుకొని తమ బాగోగులు చూసుకోకుండా ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధింపులకు గురి చేస్తున్నారని, దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పెద్దపల్లి మండలం గుర్రంపల్లి గ్రామానికి చెందిన పైడిపండ్ల తిరుపతమ్మ గృహ జ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీ అమలు కోసం దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.కమాన్ పూర్ మండలానికి చెందిన చాట్ల అనూష తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన జె.కృష్ణయ్య గ్రామ శివారులోని సర్వేనెంబర్ 56 లో గల భూమి సాదా బైనామ అమలు గురించి కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ మంథనికి రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పోషణ మాసం సందర్భంగా గర్భిణీలకు సీమంతం కార్యక్రమం

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
మండలంలోని కాట్నపల్లి అంగన్వాడి 1,2 సెంటర్లలో, సోమవారం పోషణ మాసం సందర్భాన్ని పురస్కరించుకొని గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కట్నపల్లి సర్పంచ్ ఓగు ల పూజ రాజేందర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీల ద్వారా సకాలంలో అందజేయాలని సూచించారు.పలువురు గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రత్యూష తో పాటు అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనానికి పటిష్టమైన ముందస్తు చర్యలు

**- నిమర్జన వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి**

**- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
గణేష్ నవరాత్రుల సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద ముందస్తుగా వినాయక నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్,కమిషనర్ మరియు పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.అనంతరం పెద్దపల్లి పట్టణంలోని పలు వినాయక మండపాలను ప్రభుత్వ విప్ విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద ముందస్తుగా వినాయక నిమర్జన ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ చెర్మన్,కౌన్సిలర్లు, అధికారులు,పోలీస్ సిబ్బందులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ ఎస్ జి ఎఫ్ జోనల్ లెవెల్ అథ్లెటిక్స్ లో 28 పథకాలు సాధించిన కేరళ మోడల్ హై స్కూల్ విదార్థులు

**- అభినందించిన ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్ నాయర్**

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
ఈ నెల 19 న సుల్తానాబాద్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్లో నిర్వహించిన ,సుల్తానాబాద్ జోనల్ లెవెల్ అథ్లెటిక్స్ లో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు.అండర్-17 బాలబాలికల విభాగంలో,వి.అశ్వద్ రజతం, కాంస్య పతకం, టి. సాయివిష్ణు రెండు కాంస్య పతకాలు,ఎన్. సందేష్ రజతం ఆర్.అన్వేష్ కాంస్యం,కె.యశ్వంత్ కాంస్యం, రిషివర్ధన్ బంగారు పతకం,ఎ వైశాలి,బంగారు, రెండు రజతాలు,ఒకటి కాంస్యం,ఎ.గాయత్రి ఒకటి, బంగారు,కాంస్యం,కె. శ్రీజ రజతం,బి.ఐశ్వర్య రజతం,ఆఫ్రిన్ రజతం,సుమన్ బంజారా కాంస్యం,అండర్ -14 బాలబాలికల విభాగంలో కె.శ్రీచరణ్ మూడు బంగారు పతకాలు,జి.చరిత రెండు బంగారు పతకాలు,ఒక రజత పతకం,కె వినూత్న బంగారు పతకం, వి. అవంతిక కాంస్య పతకాలు గెలుచుకున్నారు.వీరు పెద్దపల్లి డిస్ట్రిక్ట్ లో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారని సుల్తానాబాద్ జోనల్ కన్వీనర్ డి. రమేష్ , మండల కన్వీనర్ టి. ప్రణయ్ తెలిపారు,కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సిజ్జు ఎస్ నాయర్,వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్ నాయర్ పీఈ టీ,లు ఎ.అజయ్,డి.రాజు,ఉపాధ్యాయులు అభినందించారు.

## మూడో వార్డులో ఉచిత వైద్య శిబిరం

**- వైద్య శిబిరానికి భారీ స్పందన. కౌన్సిలర్ కందునూరి సమత కుమార్**
**- సందర్శించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, సోమవారం మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో కౌన్సిలర్ కందునూరి సమత కుమార్ చొరవతో ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి మూడవ వార్డు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ సందర్శించి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువలు లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.బిరుదు రాధాకృష్ణకు మూడవ వార్డు కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మె ఎల్ హెచ్ పి దివ్య, ఏఎన్ఎం రమాదేవి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచరామీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 21(జనంసాక్షి) :**
కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం మండలం లోని మంచిరామి గ్రామంలో సర్పంచ్ ఉప్పు లక్ష్మి రిటైర్డ్ ఐపీఎస్ తిరుపతి సూచన మేరకు, ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బీరకాయల లోకేష్ వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి వ్యాధులను నిర్ధారించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, గాదె విద్యాసాగర్,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.